
# పోతనభాగవతంలో రసగుళికలు

## – ఆర్.శర్మ దంతుర్తి



# 52 వ భాగం

## దక్ష ప్రజాపతి – 1

క. శ్రీ విలసితధరణీతన
యావదన సరోజ వాసరాధిప! సిత రా
జీవదళనయన! నిఖిల ధ
రావర నుత సుగుణధామ! రాఘవరామా! [4.1]

ఎప్పటిలాగే రాముడికో కందంతో ఈ స్కంధం మొదలౌతోంది. భాగవతంలోని ఈ చతుర్ధ స్కంధంలో వచ్చే ధ్రువ చరిత్ర ముందు వ్యాసాల్లో చూసాం. ఈ దక్ష యజ్ఞం కథ కూడా భాగవతం నాలుగో స్కంధం లోనిదే.

పరమశివుడి ఏ స్తోత్రం చూసినా – చంద్రశేఖరాష్టకం, లింగాష్టకం, బిల్వాష్టకం – ప్రతీదానిలోనూ చూచాయగా దక్ష యజ్ఞం గురించి ప్రస్తావన, దక్షయజ్ఞ వినాశనం గమనించవచ్చు. మహా భాగవతం రాయకముందు పోతన వీరభద్ర విజయం అనేది రాసాడుట. ఆ పద్యాలలో శివుడి గురించి రాసేటప్పుడూ, భాగవతంలో ఈ స్కంధంలో వచ్చే దక్ష యజ్ఞం గురించి వివరించేటప్పుడూ పోతన వాడిన పదాలు జాగ్రత్తగా చూస్తే పోతనలో శివభక్తుడు మనసులోంచి బయటకొచ్చి ఆ పద్యాల్లో వీరవిహారం చేయడం మనకి స్పష్టంగా కనిపిస్తుంది. పోతన రోజుల్లో మనుషుల్లో ఉన్న శివ–విష్ణువులు వేరువేరు అనే తారతమ్యాల వల్ల పోతన శివుడూ విష్ణువూ వేరు కాదని చెప్పడానికా అన్నట్టు తాను శివ భక్తుడై, విష్ణు కథలనే లీలామానుషవిగ్రహుడైన కృష్ణుడి లీలలని గురించి చెప్పే భాగవతాన్ని తెలుగులో రాసి, విష్ణువు మరో అవతారంగా చెప్పబడే రాముడికి సమర్పించాడు అంటారు.

దక్షుడు మొదట్లో అహంకారం వల్ల శివుడెవరో, ఎంతటివాడో తెలుసుకోకపోవడం, దానివల్ల వచ్చే అనర్థాలూ, ఆ అహంకారం పోగొట్టుకున్నాక భగవంతుణ్ణి తెలుసుకుని దారిలోకి రావడం అనేదే ఈ దక్ష యజ్ఞం కథ. శంకర భగవత్పాదులు ఏమంటున్నారో చూడండి.

స్మృతౌ శాస్త్రే వైద్యే శకునకవితాగానఫణితౌ
పురాణే మన్త్రే వా స్తుతినటనహాస్యేష్వచతురః।
కథం రాజ్ఞాం ప్రీతిర్భవతి మయి కోఽహం పశుపతే
పశుం మాం సర్వజ్ఞ ప్రథితకృపయా పాలయ విభో [శివానందలహరి .5]

"శాస్త్ర పాండిత్యం లేదు, వైద్యం చేయడం రాదు, కవిత్వం చెప్పలేను, సంగీతం, పాట పాడడం, మరొకటేదీ రాదు. నేను ఏమీ చేతకాని, నన్ను నేనే ఎరగని పశువుని. శివా నువ్వు పశుపతివి, అంతకన్నా మనిద్దరి మధ్యా మరో సన్నిహితమైన సంబంధం అవసరం లేదు కదా నువ్వు నన్ను ఉద్ధరించడానికి?" దీన్ని సమర్ధించడానికా అన్నట్టు దక్షుడు మొదట్లో అహంకారం వల్ల శివుణ్ణి కించపరిచి యజ్ఞంలో ఆ అహంకారపూరితమైన తల

పోగుట్టుకుని చివరికి శివ శరణం చేసి శుద్ధుడౌతాడని చెప్పేదే ఈ దక్ష యజ్ఞం కథ. మరి అహంకారం అంత సులభంగా పోదు కనకా, భగవంతుడిమీద ఆ భక్తి ఒక్కసారి రాదు కనకా ఒకేసారి అపరిమితమైన ఆనందం (భగద్దర్శనం, ఆత్మ జ్ఞానాల వల్ల) వస్తే తట్టుకోలేము అనేది అందరికీ తెలిసిన వాస్తవం కనకా ఆ భక్తీ, ఆనందం మెల్లగా సాధన వల్ల ఎలా రావాలనేది శివానందలహరి లోనే శ్రీశంకరుల మరో శ్లోకంలో చూడవచ్చు.

ఆనన్దామృతపూరితా హరపదాంభోజాలవాలోద్యతా
స్థైర్యోపఘ్నముపేత్య భక్తి లతికా శాఖోపశాఖాన్వితా ।
ఉచ్చైర్మానస కాయమానపటలీమాక్రమ్య నిష్కల్మషా
నిత్యాభీష్ట ఫలప్రదా భవతు మే సత్కర్మ సంవర్ధితా [శివానందలహరి .49]

"పరమేశ్వర సేవానురక్తి నీటిపోతగా, శివచరణకమలము పాదుకగా, చిత్త స్థైర్యములు పాకుడు గంపగా మొదలుపెట్టి చిలువలు పలువులుగా ఉన్నతమైన మనస్సనే పందిరి అల్లుకుంటూ చీడ మొదలైన దోషములచే శిధిలం కాకుండా పెంపొంది నా శివభక్తి పుణ్యకర్మలచే శాశ్వత ఫలము సంపాదించుగాక."

మెల్లగా చిలువలు పలువలుగా రావాలని ఎందుకంటున్నారంటే ఒకేసారి అఖండానందం వస్తే గుండె ఆగి చావడం అనేది మనందరికీ తెలిసిన విషయం. ఒక్కో మెట్టూ ఎక్కుతూ పైకి రావాలని చెప్తున్నారు తప్ప ఇప్పుడే ఇక్కడే నాకు ఆత్మసాక్షాత్కారం ఇచ్చేయి దేవుడా అని అడగట్లేదు. ఈ శ్లోకాలు అసలు – ఏ కష్టమూ లేకుండా అన్నీ లభించాలి అనుకునే – మనలాంటి వాళ్ళగురించే. ఇదే సరిగ్గా శ్రీరామకృష్ణుల వంటివారు వివేకానందులంతటివారికి తప్ప ఆయన శిష్యులమని చెప్పుకునే ప్రతీ ఒక్కరికీ దైవదర్శనం ఇవ్వకపోవడానికి కారణం. అసలు ఆత్మసాక్షాత్కారం వస్తే ఎలా ఉంటుందనేది రామకృష్ణా మఠానికి చెందిన స్వామి జ్ఞానేశ్వరానంద గారు చెప్తున్నారు చూడండి.

"మీకు ఈ జన్మలో ఇప్పటిదాకా ఆనందం కలిగించిన విషయం గుర్తు తెచ్చుకోండి. అది పాయసం తినడం వల్ల వచ్చిందా, డబ్బు దొరకడం వల్లా, మరోదానివల్లా అనేది ఓ సారి గుర్తు తెచ్చుకుని ఆ ఆనందాన్ని ఓ సారి నెమరు వేసుకోండి. ఇప్పుడా ఆనంద క్షణాలని పది లక్షల కోట్ల రెట్లు హెచ్చించండి. ఆత్మసాక్షాత్కారం కలిగినప్పుడు అటువంటి ఆనందం మీ స్వంతమౌతుంది. ఒక్కసారి మాత్రమే కాదు, ఆ కట్టలు తెంచుకునే ఆనందంలో మీరు ప్రతీ క్షణం ఓలలాడుతారు." మరి అటువంటి ఆనందం ఏ సాధనా, ఏ కష్టమూ పడకుండా వస్తే ఏమౌతుంది? గుండె ఆగి చావమూ? ఈ కారణం వల్లే ఒక్కో మెట్టూ పైకెక్కుతూ వచ్చిన అతి పెద్ద ధనవంతులు కోట్ల డబ్బులు మూలుగుతున్నా మామూలుగా ఉండగలరు కానీ ఒకేసారి అదృష్టం తన్నుకొచ్చి ఆ కోట్లు వచ్చినవాడికి గుండె ఆగడం, అనేకానేక దరిద్రాలు తగులుకోవడం గమనించవచ్చు. ఇదే సరిగ్గా శంకర భగవత్పాదులు చెప్తున్నది. అందుకే సాధన చేస్తూ క్రమంగా పైకి ఎదుగుతూ ఆత్మ సాక్షాత్కారం పొందడం ముఖ్యం. దీనికి అనేకానేక జన్మలు పట్టవచ్చు; ఎందుకంటే లక్ష్యం అతి కష్టమై, మహోన్నతమైనది; దానితో పోలిస్తే మానవ జీవితం, ఆయుర్దాయం అతి చిన్నదీను. అందుకే క్రమంగా సాధన చేయడం. దీన్నే బుద్ధుడు, పతంజలి వంటివారు అష్టాంగ యోగం అంటే మరొకరు మరోలా పిలవడం. ఇదంతా ఓ క్రమం ప్రకారం పరమేశ్వరుడు ఆట ఆడించినట్టూ జరుగుతూ ఉంటుంది. ఈ దక్ష యజ్ఞంలో కూడా దక్షుడు ఇలాగే పైకి రావడం మనం చూస్తాం. అయితే భక్తితో శివుణ్ణి కన్నప్ప లాగా కొలిచేసి జ్ఞానం సులభంగా సాధించేయొచ్చు కదా? అవును తప్పకుండా చేయొచ్చు కానీ ఆ భక్తి మనకి కుదరవద్దూ? అది కుదరడానికి ఎన్ని జన్మలు పడుతుందో ఎవరికెరుక? దీన్నే ఇంతకుముందు వ్యాసాల్లో నారదుడు ధర్మజుడుకి చెప్పడం గమనించాం.

శా. కామోత్కంఠత గోపికల్, భయమునం గంసుండు, వైరక్రియా
సామాగ్రిన్ శిశుపాలముఖ్య నృపతుల్, సంబంధులై వృష్ణులున్,
ప్రేమన్ మీరలు, భక్తి నేము, నిదె చక్రింగంటి; మెట్లైన ను
ద్ధామ ధ్యానగరిష్ఠుఁ డైన హరిఁ జెందన్ వచ్చు ధాత్రీశ్వరా! [7-18]

అంటే ఏ విధంగా మనం భగవంతుణ్ణి గుర్తుంచుకున్నాం అనేది ముఖ్యం కాదు కానీ సర్వవేళలా మన మనసులో ఉన్నాడా లేదా అనేది ముఖ్యం. మనుషులందరికీ ఒకే రకం మనఃస్తత్వం ఉండదు కాబట్టి ఎవరికిష్టం వచ్చినట్టూ వాళ్ళు భవవంతుణ్ణి ఏ రూపంలోనైనా గుర్తుపెట్టుకోవచ్చు. దీని సంగతి హిరణ్యాక్ష, హిరణ్యకశిపుల విషయంలో చూసాం. దక్ష యజ్ఞం కథ చెప్పేది కూడా స్థూలంగా ఇదే.

స్వాయంభువ మన్వంతరంలో మనువు తన మూడవ కూతురైన ప్రసూతి అనే కన్యను బ్రహ్మ కుమారుడైన దక్షప్రజాపతికి ఇవ్వడంతో దక్షుడి కథ మొదలౌతుంది. ప్రజాపతులంటే లోకాలలో జనోత్పత్తికి కారణమైన వారని చెప్పుకోవచ్చు. ఆ దక్షుడికి పదహారు మంది కుమార్తెలు పుట్టారు.

క. వనజజునివలన భవ మం
దిన యా దక్షప్రజాపతికి మను నిజ నం
దన యగు ప్రసూతి సతి యం
దనఘా! పదయార్వు రుదయ మందిరి కన్యల్ [4-27]

వ. ఇట్లావిర్భవించిన కన్యకలందు శ్రద్ధయు, మైత్రియు, దయయు, శాంతియుఁ, దుష్టియుఁ, బుష్టియుఁ, బ్రియయుఁ, నున్నతియు, బుద్ధియు, మేధయుఁ, దితిక్షయు, హ్రీయు, మూర్తియు నను నామంబులు గల పదుమువ్వురను ధర్మరాజున కిచ్చె; ఒక్క కన్యక నగ్నిదేవునకును నొక్కతెం బితృదేవతలకును నొక్కతె **జన్మమరణాది నివర్తకుం డగు నభవునకుం బెండ్లి చేసె**; అంత నా ధర్ముని పత్నుల యందు శ్రద్ధవలన శ్రుతంబును, మైత్రివలనఁ బ్రసాదంబును, దయవలన నభయంబును, శాంతివలన సుఖంబును, దుష్టివలన ముదంబును, బుష్టివలన స్మయంబును, గ్రియవలన యోగంబును, నున్నతివలన దర్పంబును, బుద్ధివలన నర్థంబును, మేధవలన స్మృతియుఁ, దితిక్షవలన క్షేమంబును, హ్రీవలనఁ బ్రశ్రయంబును, మూర్తివలన సకలకల్యాణగుణోత్పత్తి స్థానభూతులగు నరనారాయణు లను ఋషు లిద్దఱును సంభవించిరి; వారల జన్మకాలంబున. [4-28]

ఇలా పుట్టిన పదహారు మంది కన్యలనీ దక్షుడు ఒక్కొక్కరినీ ఒక్కొక్క దేవత కిచ్చి పెళ్ళిచేశాడు. పదముగ్గురుని ధర్మదేవతకి ఇస్తే ఒకావిడని అగ్నిదేవుడికీ, ఇంకొకావిడని పితృదేవతలకీ, చివరన సతిని జనన మరణాలు లేని మృత్యుంజయుడైన (జన్మమరణాది నివర్తకుండగు నభవునకు) శివుడికిచ్చాడు. అందులో మూర్తి అనే ఆవిడ వల్ల సకల కల్యాణ గుణ సంపన్నులైన నర నారాయణులు ఉద్భవించారు.

పై వచనంలో ఎవరివల్ల ఎవరు పుట్టారో అనేది మరో సారి చదివితే అసలు ఇంతమంది నిజంగా పుట్టారా, లేకపోతే "దీని-వల్ల-అది" అనేది జరుగుతుందని చెప్తున్నారా భాగవతంలో అనిపిస్తుంది - శ్రద్ధ వల్ల శ్రుతం (అంటే శాస్త్రం, వినికి), మైత్రి వల్ల ప్రసాదం, దయ వల్ల అభయం, శాంతి వల్ల సుఖం, తుష్టి వల్ల ముదం (సంతోషము), పుష్టి వల్ల స్మయం (గర్వం, ఆశ్చర్యం), క్రియ వల్ల యోగం, ఉన్నతి వల్ల దర్పం, బుద్ధి వల్ల అర్థం, మేధ వల్ల స్మృతి, తితిక్ష వల్ల క్షేమం (తితిక్ష అంటే ఓర్పు), హ్రీ వల్ల ప్రళయం (హ్రీ అంటే సిగ్గు, లజ్జ). అంటే ఏయే గుణాలు అలవర్చుకుంటే ఏవి మన స్వంతమౌతాయో వివరిస్తున్నారన్నమాట.

సీ. గంధవాహుఁడు మందగతి ననుకూలుఁడై;
వీచె; నల్దిక్కులు విశద మయ్యె;
నఖిలలోకంబులు నానందమును బొందెఁ;
దుములమై దేవదుందుభులు మ్రోసెఁ;
గరమొప్ప జలధుల కలఁక లడంగెను;
మించినగతిఁ బ్రవహించె నదులు;

గంధర్వ కిన్నర గానముల్ వీతెంచె;
నప్సరోజనముల నాట్యమొనరె [4-29]

తే. సురలు గురియించి రందంద విరులవాన;
మునిజనంబులు సంతోషమునఁ జెలంగి
వినుతు లొనరించి; రవ్వేళ విశ్వ మెల్లఁ
బరమమంగళమై యొప్పె భవ్యచరిత! [4-29.1]

నర నారాయణులు పుట్టడమే లోక కల్యాణం కోసం కనక, ఆ సమయంలో వాయువులు మెల్లగా వీచాయి. దేవ దుంధుబులు మ్రోగి, సముద్రాలు కలతలేకుండా, నదులు మితంగా ప్రవహిస్తూ లోకాలన్నీ ఆనందంగా ఉన్నాయి. మునిజనాలందరూ సంతోషంగా ఉండగా విశ్వమంతా మంగళకరమై ఉంది.

క. ధరణీభర ముడుపుట కా
నరనారాయణులు భువి జనన మనయము నొం
దిరి యర్జున కృష్ణాఖ్యులఁ
గురుయదువంశముల సత్త్వగుణయుతు లగుచున్. [4-33]

ఉత్తరోత్తరా, భూభారాన్ని తగ్గించడానికి ఆ నరనారాయణులే మీ తాత అయిన అర్జునుడు, ఆయన ప్రియ స్నేహితుడైన కృష్ణుడిగా కురు, యదు వంశాలలో సత్త్వగుణ సంపన్నులై జన్మించారు.

ఇది శుక మహర్షి పరీక్షిత్తుతో చెప్తున్నాడు కనక మీ తాత అర్జునుడు అన్నాడన్నమాట. రాబోయే వ్యాసాలలో అసలు దక్షుడికి పరమేశ్వరుడితో ఎందుకు, ఎంత చిన్న విషయానికి విరోధం వచ్చిందో, అహంకారంతో గోరంతలు కొండంతలు చేసుకుంటూ ఆ విరోధాన్ని మనసులో పెంచుకుంటూ ఎలా తన వినాశనానికి దారితీసుకున్నాడో చదువుతాం.

పోతన భాగవతం ఇంటర్నెట్లో ఇక్కడ చూడవచ్చు: http://telugubhagavatam.org/

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS